

# అన్యోన్య దాంపత్య రహస్యాలు

గోపాలశాస్త్రి

వారి అన్యోన్య దాంపత్యం గురించి నాలుగు సంగతులూ తెలుసుకుని పత్రికకు వ్రాద్దామని మండు వేసవిలో ఒక సెలవు రోజున నేను వాళ్ళ గృహానికి వెళ్ళాను. భర్త డ్రాయింగ్ రూములో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

నమస్కారం పెట్టి నన్ను పరిచయం చేసుకుని వచ్చిన సంగతి బయటపెట్టాను. "అయితే నా భార్యను పిల్చుకుని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి కాసేపట్లో ఆమెతో ప్రవేశించాడు: ఆమె కొంచెం పొట్టిగా ఉన్నది. శ్యామసుందరి.

"సరే మీ ప్రశ్నలు అడగండి" అన్నాడు ఆయన చాలా ఖరీదైన సిగరెట్టు ఒకటి నాకిచ్చి ఆయన ఒకటి ముట్టించి.

"మీది చాలా ఆదర్శదాంపత్యం అంటారు" అని నెమ్మదిగా అన్నాను.

"అని అందరూ అంటారండీ" అన్నది ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఈ ఆదర్శదాంపత్యం వెనకాల వున్న రహస్యాలేమిటి" అని అడిగాను.

"ఏమీలేదు. మా పెళ్ళయ్యాక ఆయన ప్రహ్లాదుడిలా పరకాంతలను తల్లుల మల్లే చూడటమే" అని గట్టిగా నవ్వింది ఆ శ్యామసుందరి.

"వివాహిత స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలంటారా?" అన్నాను.

"తప్పకుండా ఉండాలి"

"ఇది ఎలా సాధ్యమవుతుంది?"

"ఏమున్నది? ఒకటో తారీఖున జీతంరాగానే దొరవారు పేకెట్ గృహిణి చేతిలో పెడితే సమస్యలు కొంతవరకూ సాల్వ్ అవుతాయి" అని సమాధానం.

"అన్యోన్య దాంపత్యానికీ, భార్యాభర్తల వయస్సుకు సంబంధం వుందా?"

స్థురద్రూపి కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. తర్వాత ఇలా సెలవిచ్చాడు ఆయన. "చార్లీ చాప్లినుకూ, ఆయన భార్య ఊనా ఓనిల్‌కూ ఇంచుమించు 35 ఏళ్ళు తేడా, అయితేనేం చాలా సుఖంగా లేరూ!"

ఇలా ఇలా నడిచింది నా ఇంటర్వ్యూ. ఆఖరున ఒక ప్రశ్న వేశాను. "మీరిద్దరూ ఎలా కలుసుకున్నారు? మీ పెళ్ళికి ముందు ఏమైనా లెక్కలు వేసి చూసుకున్నారా?" అని.

స్థురద్రూపి మరో సిగరెట్టు వెలిగించి దూరంగా చూస్తూ ఇలా చెప్పాడు—"నేను హాస్టల్లో ఉండి ఎమ్మే ఫైనలియరు చదువుతున్నాను. హాస్టలు భోజనంతో విసిగెత్తి సెలవులకు రెండు రోజులు ముందుగానే మా బావగారి ఊరికి వెళ్ళాను. ఆయనో ఉన్నతోద్యోగి. నేను వెళ్ళిన కొద్దిరోజులకే ఆ ఊరు ఓ గొప్ప దేశ నాయకుడు వచ్చాడు. ఆ రోజు మా జీవితాల్లో ఎంతో ముఖ్యమైనది. ఊరు ఊరంతా ఆ మహనీయుని చూడటానికి వెళ్ళింది. నేను మాత్రం వెళ్ళకుండా పెరటిలోనికి వెళ్ళి సాయంకాలపు గాలి పీలుస్తూ ఓ కుర్చీలో కూర్చున్నాను. కాస్సేపటికి తలెత్తి చూస్తే మా పక్కింటి వాళ్ళ ఇల్లు కూడా నిశ్శబ్దంగా వుంది. ఓ కిటికీ వద్ద ఒక సుందర వదనం కనిపించినది. వెంటనే మామూలు యువకుడిలా ఈలవేశాను. అదే మా ఆదర్శదాంపత్యానికి నాంది. ఈల నుండి ప్రేమ, ప్రేమ నుండి వివాహం. ఆరోజు ఆ నాయకుడు మా వూరికి రాకపోతే, మా చుట్టుపక్కల అంతా ప్రశాంతంగా ఉండకపోతే, మా ప్రేమకు అంకురార్పణ జరిగేది కాదేమో. అందుకే ఆ నాయకుడు నిలువెత్తు ఫోటో ఈ డ్రాయింగ్ రూంలో పెట్టాం" అన్నాడు—స్థురద్రూపి.

చటుక్కున దంపతులిద్దరూ లేచి ఆ పటం ముందు మోకరిల్లారు.